క్లుప్తంగా

శెట్పల్లి యువకుడికి డాక్టరేట్



లింగంపేట(ఎల్లారెడ్డి): శెట్పల్లి గ్రామానికి చెందిన బందరబోయిన శ్రీనివాస్ డాక్టరేట్ పట్టా పొందారు. ఆయనకు 'తెలంగాణ ఉద్యమంలో నిజామాబాద్ జిల్లా గేయ సాహిత్యం–సమగ్ర పరిశీలన' అనే అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ వచ్చింది. శ్రీనివాస్ చిన్ననాటి నుంచి భజన పాటలు, సాహిత్యం పైన మక్కువ పెంచుకున్నారు. తెలంగాణ విశ్వ విద్యాలయం నుంచి ఎంఏ తెలుగులో పట్టా అందుకున్నాడు. చదువుతూనే రచనలు చేశారు. పాటలు రచిస్తూ పాడారు. ప్రజల్లో సామాజిక స్పృహను కలిగించారు. ఆయన ప్రభులింగ శతకం, అమ్మ మెచ్చు భావాలు, తెలంగాణ పోరాటం, ప్రభుస్వామికి అక్షరాభిషేకం తదితర రచనలు చేశారు. వీటితో పాటు దిన, వార, మాస పత్రికల్లో పాటలు, గేయాలు, కవితలు ప్రచురితమయ్యాయి.

శిశుమందిర్ ఆచార్యులకు మార్గనిర్దేశం



రామారెడ్డి(ఎల్లారెడ్డి): పోసానిపేట సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో శనివారం సరస్వతి విద్యాపీఠం ఇందూర్ విభాగ్ స్థాయి ఆధార భూత విషయాల వర్గ ఉద్ఘాటన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ముప్పారపు ఆనంద్ భగత్ సింగ్‌నగర్ పాఠశాల అధ్యక్షుడు జ్యోతి ప్రజ్వలన చేశారు. కరపత్రాలను ఆవిష్కరించారు. శ్రీరెడ్డి హరిస్మరణ్ రెడ్డి, ఇందూర్ విభాగ్ కార్యదర్శి ఆచార్యులకు ఆధార భూత విషయాల గురించి మార్గదర్శనం చేశారు. పాఠశాల అధ్యక్షుడు బలగం వెంకట రాములు, ఆచార్యులు పాల్గొన్నారు.

అధ్వానంగా మురికి కాలువలు



పెద్దకొడప్‌గల్(జుక్కల్): అంజని గ్రామంలో మురికి కాలువలు అధ్వానంగా ఉన్నాయి. చాలా రోజుల నుంచి మురికి కాలువలను శుభ్రపరడం లేదని కాలనీవాసులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంగా మలేరియా, డెంగీ జ్వరాలు వస్తున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కాలువలను శుభ్రం చేయించాలని, అలాగే నూతన డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

వర్షంతో పంటలకు జీవం



మద్నూర్(జుక్కల్): పంటలు ఎండుతున్న సమయంలో భారీ వర్షం కురియడంతో పంటలకు జీవం పోసినట్లు అయ్యిందని రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 20 రోజుల తర్వాత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు భూమి పూర్తిగా నాని పంటలు కళకళలాడుతున్నాయి. మండలంలోని సోయాబీన్, పత్తి, పెసర, మినుము, కంది పంటలు సాగవుతున్నాయి. శనివారం మండలంలో 20 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ క్రాంతికుమార్ తెలిపారు.

కొనసాగుతున్న స్వీపర్ల దీక్షలు

కామారెడ్డి రూరల్: పార్ట్ టైం స్వీపర్లను రెగ్యులరైజ్ చేయాలని కామారెడ్డి ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే దీక్షలు శనివారం నాటికి 55వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు ఉద్యోగ భద్రత కల్పించి రూ. 27 వేల వేతనం చెల్లించాలన్నారు. చనిపోయిన స్వీపర్ల స్థానంలో తమ వారసులను నియమించాలన్నారు. విద్యార్హత ఉన్నవారికి అటెండర్లుగా నియమించాలన్నారు. పీఎస్, యూపీఎస్, జెడ్పీహెచ్ఎస్‌లలో పనిచేస్తున్న స్వీపర్లను రెగ్యులరైజ్ చేయాలన్నారు. స్వీపర్లు సిద్దిరాములు, సాయన్న, సరోజన, గంగారాం ఉన్నారు.

ఎస్సైగా ఎంపికైన యువతికి సన్మానం



బీబీపేట: శేరిబీబీపేటకు చెందిన బీమరి సృజన ఇటీవల ఎస్సైగా ఎంపికైంది. శనివారం స్థానిక ఎస్సై సాయిరెడ్డి తుజాల్‌పూర్ పాఠశాలలో ఆమెను ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. పేదింట్లో పుట్టి పెరిగి కష్టపడి చదివి ఎస్సైగా ఎంపిక కావడం మండలానికి గర్వకారణమని అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి సృజనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఏఎస్సై ప్రభాకర్, సిబ్బంది నవీన్, గ్రామస్తులు స్వామి తదితరులు పాల్గొన్నారు.

నాటుతున్నారు.. నరుకుతున్నారు!

- విద్యుత్ తీగల కిందనే హరితహారం
- తీగల వరకు పెరగగానే నరికేస్తున్న విద్యుత్ సిబ్బంది
- అభాసుపాలవుతున్న హరితహారం
- అడుగడుగునా అధికారులు నిర్లక్ష్యం



గుండారం రోడ్డులో విద్యుత్ తీగల కింద పెరిగిన హరితహారం చెట్లు

రాజంపేట: అధికారులతో తప్పిదాలతో హరితహారం అభాసుపాలవుతోంది. రోడ్ల వెంట, విద్యుత్ తీగల కింద మొక్కలు నాటడంతో అవి కాస్త పెరగగానే విద్యుత్ అధికారులు తప్పనిసరి పరిస్థితుల్లో నరుకుతున్నారు. జిల్లాలో ఏ మండలంలో చూసినా ఇదే తంతు కనిపిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 526 గ్రామ పంచాయతీ పరిధిలలో నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలు పెంచి నాటుతున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. మొక్కలకు ఎలాంటి ఇబ్బందులు లేని స్థలాల్లో నాటాల్సి ఉండగా రోడ్ల వెంట, విద్యుత్ తీగల కింద నాటడంతో అనేక సమస్యలు తలెత్తున్నాయి. నాటిన మొక్కలు తప్పని పరిస్థితుల్లో నరకాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. నరికిన చోటే మళ్లీ కొత్త మొక్కలు నాటడం విడ్డూరం. అయితే మొక్కలను అధికారులు లెక్కల కోసం నాటుతున్నారా..? లేక సంరక్షణ కోసం నాటుతున్నారా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఏటా జిల్లా వ్యాప్తంగా రూ.లక్షలు వెచ్చించి నర్సరీల్లో మొక్కలు పెంచి వాటిని రెండు, మూడు నెలల పాటు సంరక్షించి ఎన్ఆర్ఈజీఎస్ కూలీలలో నాటిస్తారు.

టార్గెట్ 28 లక్షల 11 వేలు మొక్కలు

ఈ ఏడాది హరితహారంతో భాగంగా జిల్లాలోని 526 గ్రామ పంచాయతీలతో పాటు మున్సిపల్ శాఖతో పాటు డీఆర్‌డీఏ, అగ్రికల్చర్, హార్టికల్చర్, ఫారెస్టు, ఎక్సైజ్, మైనింగ్, అంగన్వాడీ, విద్యాశాఖతో పాటు తదితర శాఖల పరిధిలో 28 లక్షల 11 వేల మొక్కలు నాటాలని నిర్దేశించారు. ఇప్పటికే సుమారు 27 లక్షల మొక్కలు నాటినట్లు అధికారులు చెబుతున్నారు.



పెరిగిన చెట్లను నరికేసిన విద్యుత్ అధికారులు

ప్రాణ నష్టం..ఆస్తి నష్టం

రోడ్ల వెంట, విద్యుత్ తీగల కింద మొక్కలు నాటడంతో ఈదురు గాలుతో కూడిన వర్షాలకు చెట్లు విరిగి విద్యుత్ తీగలపై పడుతున్నాయి. ఈ కారణంగా స్తంభాలు విరిగిపోవడంతో పాటు విద్యుత్ తీగలకు తాకి పలువురు మృత్యువాత పడుతున్నారు. అలాగే మేత కోసం వెళ్లే పశువులు సైతం వాటిని తాకి దుర్మణం పాలవుతున్నాయి.

సమస్యలు తలెత్తకుండా చూస్తాం



హరితహారంలో భాగంగా నాటే చెట్లను గతంలో రోడ్డుకు ఇరువైపులా నాటాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మొక్కలను నాటాం. కొన్ని చోట్ల విద్యుత్ తీగలకు ఇబ్బందులు కలిగించాయి. విద్యుత్ తీగల కింద తక్కువ ఎత్తు పెరిగే మొక్కలు నాటేలా చర్యలు తీసుకుంటాం. ఇకపై విద్యుత్ తీగలకు ఇబ్బందులు తలెత్తకుండా మొక్కలు నాటేలా చర్యలు చేపడతాం.

– బాలకిషన్, ఎంపీడీవో, రాజంపేట

ఉద్యోగులను మోసం చేసిన ఘనత కేసీఆర్‌దే



జిల్లా కేంద్రంలో వర్షంలో నిరసన తెలుపుతున్న ఏఎన్ఎంలు



మాట్లాడుతున్న బీజేపీ నేత వెంకట రమణారెడ్డి

కామారెడ్డి టౌన్: ప్రత్యేక తెలంగాణ సాధించుకుంటే కాంట్రాక్ట్ ఉద్యోగ వ్యవస్థ ఉండదని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చి ఉద్యోగులను మోసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని కామారెడ్డి బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకట రమణారెడ్డి ఎద్దేవా చేశారు. ఏఐటీయూసీ, మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏఎన్ఎంలు చేపట్టిన సమ్మెకు ఆయన మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఇప్పటికైనా సీఎం సోయి తెచ్చుకుని కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలా 1న ఉద్యోగులకు జీతాలు ఇయ్యలేని దౌర్భాగ్యం తెలంగాణకు పట్టిందన్నారు.

నాలుగో రోజుకు చేరిన సమ్మె

ఏఎన్ఎంల సమ్మె శనివారం 4వ రోజుకు చేరుకుంది. శిబిరంలో వర్షంలో సైతం నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఎన్ఎంలు మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా వైద్య ఆరోగ్యశాఖలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను ఎలాంటి పరీక్ష లేకుండా క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేశారు.

షరతులు లేకుండా పర్మినెంట్ చేయాలి

కామారెడ్డి రూరల్: ఎలాంటి షరతులు లేకుండా కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను పర్మిట్ చేయాలని సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు రాజనర్సు డిమాండ్ చేశారు. కామారెడ్డి ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టిన ఏఎన్ఎంల నిరవధిక సమ్మె శనివారం నాటికి 5వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా రాజనర్సు మాట్లాడుతూ.. ఐదు రోజులుగా ఏఎన్ఎంలు నిరవధిక సమ్మె చేపడుతున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. నాయకులు లక్ష్మి, సీహెచ్ దీవెన, రజనిత పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు

నిజాంసాగర్(జుక్కల్): పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో 29 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా పథకాలను ప్రవేశపెడుతుండటంతో ప్రతిగడపకూ లబ్ధి చేకూరుతోందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు దుర్గారెడ్డి, గంగారెడ్డి, సత్యనారాయణ, గైని విఠల్, నర్సింహారెడ్డి, వాజిద్‌అలీ, రమేష్‌గౌడ్, లక్ష్మారెడ్డి, తహసీల్దార్ భిక్షపతి పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న జెడ్పీ మాజీ చైర్మన్ రాజు

నియామక ఉత్తర్వుల అందజేత



ఉత్తర్వుల కాపీ అందజేస్తున్న స్పీకర్ పోచారం

బాన్సువాడ: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను గ్రేడ్–4 పంచాయతీ కార్యదర్శులుగా నియమిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను శనివారం అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తన నివాసంలో జేపీఎస్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. పరిపాలనా సౌలభ్యం కోసం తెలంగాణలో 10 జిల్లాలను 33 జిల్లాలుగా, 48 రెవెన్యూ డివిజన్లను 72కు, 460 మండలాలను 610 మండలాలుగా మార్చుకున్నామన్నారు. అదే విధంగా 8,670 పంచాయతీలుంటే 12,751కి పెంచుకోవడమే కాకుండా 9,355 మంది పంచాయితీ కార్యదర్శులను భర్తీ చేశామన్నారు. ప్రతి జీపీకి ఒక కార్యదర్శిని నియమించిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గ్రామాల్లో సుమారు 63 రకాల బాధ్యతలు నిర్వర్తిస్తున్న పంచాయతీ కార్యదర్శులు నేడు శాశ్వత ఉద్యోగం పొందటం హర్షణీయమన్నారు.

ఎయిడ్స్, టీబీపై విద్యార్థులకు క్విజ్ పోటీలు



కామారెడ్డి టౌన్: జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శనివారం జిల్లా కేంద్రంలోని లయోల పాఠశాలలో జిల్లా స్థాయి క్విజ్ పోటీలను నిర్వహించారు. ఎయిడ్స్, టీబీ, రక్త దానం తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. విజేతలకు క్యాష్ ప్రైజ్‌తో పాటు జ్ఞాపికలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో డీపీఎం సుధాకర్, ఐసీటీసీ కౌన్సిలర్ నాగరాజు, మహేష్, కరుణ, స్రవంతి, హనుమంతు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన మద్దికుంట బీజేపీ ఎంపీటీసీ

రామారెడ్డి (ఎల్లారెడ్డి): మద్దికుంట ఎంపీటీసీ సభ్యుడు గజ్జల రాజేందర్ ప్రభుత్వ విప్ కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సమక్షంలో శనివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కామారెడ్డి నియోజకవర్గంలో బీజేపీ తరఫున తనొక్కడినే ఎంపీటీసీగా కొనసాగానని, పార్టీ తనను పట్టించుకోకపోవడం, రామారెడ్డి మండలంలో ఎల్లారెడ్డి నియోజకవర్గానికి సంబంధించిన కార్యక్రమంలో కనీసం తనను స్టేజి పైకి పిలువకపోవడం బాధించిందని ఎంపీటీసీ రాజేందర్ అన్నారు. మద్దికుంట గ్రామాభివృద్ధికి సహకరిస్తానని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ హామీ ఇవ్వడంతో బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, రామారెడ్డి ఎంపీపీ దశరథ్ రెడ్డి, వైస్ ఎంపీపీ రవీందర్‌రావు, మాచారెడ్డి జెడ్పీటీసీ మిన్కూరి రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న గంప గోవర్ధన్

ఏడు వైన్ షాపులకు 323 దరఖాస్తులు



మాట్లాడుతున్న సీఐ షాకీర్ అహ్మద్

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఏడు వైన్ షాపులకు 323 దరఖాస్తులు వచ్చినట్లు సీఐ షాకీర్ అహ్మద్ శనివారం తెలిపారు. రెండేళ్ల క్రితం వైన్ షాపులకు 130 దరఖాస్తులు రాగా ఈ సారి 323 దరఖాస్తులు వచ్చాయన్నారు. 24వ షాప్‌నకు 47, 25కు 49, 26వ షాప్ గౌడ్ రిజర్వేషన్ కాగా దీనికి 38, 27వ షాప్‌నకు 43, 28వ షాప్ ఎస్సీకి 36, 29వ షాప్ ఎస్టీకి రిజర్వు కాగా దీనికి 48, 30వ షాప్‌కు 62 దరఖాస్తులు వచ్చినట్లు సీఐ తెలిపారు. ఎల్లారెడ్డి స్టేషన్ పరిధిలో అత్యధికంగా నాగిరెడ్డిపేట వైన్ షాప్‌కు 62 దరఖాస్తులు వచ్చాయన్నారు. వైన్ షాప్‌లకు లక్కీ డ్రా ఈనెల 21న జిల్లా కేంద్రంలో నిర్వహిస్తామన్నారు.

పవర్ డిప్లొమా ఇంజనీర్ల సంఘ కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

కామారెడ్డి అర్బన్: తెలంగాణ పవర్ డిప్లమా ఇంజినీర్స్ అసోసియేషన్ ఎన్నికలను శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా సీహెచ్. మల్లేష్, సర్కిల్ సెక్రటరీగా వరయోగి ప్రదీప్ కుమార్, ట్రెజరర్‌గా దేవి ప్రసాద్, ఆఫీస్ సెక్రటరీగా జీ.ప్రణతి, లేడీ రిప్రజెంటేటివ్‌గా ఎం.దివ్య తేజ, సలహాదారులుగా బి.రఘు కుమార్‌లను ఎన్నుకున్నారు. కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి డివిజన్ కార్యదర్శులుగా లక్ష్మయ్య, నాందేవ్, వెంకట్ స్వామి డివిజన్ ట్రెజరర్లుగా సీహెచ్. శ్రీనివాస్, బి.నరేష్, కె.దీపిక, డి.నరేష్‌లు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా వై.ప్రకాష్ వ్యవహరించారు.

బీబీఏ కోర్సుతో ఉద్యోగ అవకాశాలు

కామారెడ్డి టౌన్: ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో నూతనంగా ప్రవేశపెట్టిన బీబీఏ కోర్సుతో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు విరివిగా ఉంటాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కిష్టయ్య శనివారం తెలిపారు. ఈ కోర్సు చేసే విద్యార్థులకు వారంలో మూడు రోజులు తరగతి గదిలో విద్యాబోధన, మూడు రోజుల పాటు జాబ్ ట్రైనింగ్ ఇస్తామని వివరించారు. అంతేకాకుండా మూడు సంవత్సరాల పాటు స్టైఫండ్ వస్తుందన్నారు. ఈ కోర్స్ పూర్తి చేసిన విద్యార్థులకు క్యాంపస్ రిక్రూట్మెంట్ ద్వారా గ్యారెంటీగా ఉద్యోగ అవకాశం వస్తుందన్నారు. ఇంటర్ పూర్తి చేసిన అన్ని గ్రూపుల విద్యార్థులు ఈ కోర్సు చేయడానికి అర్హులని, విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకొని కోర్సులో చేరాలని కోరారు.

బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

బాన్సువాడ: బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు శనివారం బాన్సువాడలో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. సుమారు 50 మంది గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు వారు ప్రకటించారు. బీర్కూర్ ఎంపీపీ రఘు, నాయకులు శశికాంత్, సర్పంచులు బాబురావు, కృష్ణారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో డీసీసీబీ చైర్మన్ భాస్కర్ రెడ్డి

పద్మశాలి సంఘ భవన నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న వెంకట రమణారెడ్డి



కొండాపూర్‌లో భూమి పూజ చేస్తున్న సర్పంచ్

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గ్రామంలోని 10వ వార్డులో పద్మశాలి సంఘ భవన నిర్మాణానికి బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకట రమణారెడ్డి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి..

లింగంపేట(ఎల్లారెడ్డి): కొండాపూర్‌లో నూతన గ్రామ పంచాయతీ భవనానికి సర్పంచ్ సత్యనారాయణ శనివారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సందీప్‌గౌడ్, ఎంపీటీసీ సర్వన్‌నాయక్, కార్యదర్శి జైల్‌సింగ్, సాయాగౌడ్, కాశీరాం, గ్రామ పంచాయితీ పాలక వర్గం సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

'ఒక్క ఫొటోతో ఎన్నో జ్ఞాపకాలు పదిలం'



జ్యోతిప్రజ్వలన చేస్తున్న సీఐ రామన్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఒక్క ఫొటో ఎన్నో జ్ఞాపకాలను పదిలం చేస్తుందని సీఐ రామన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఫొటో సృష్టికర్త లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఇప్పుడు ఫొటో దిగాలంటే చేతిలోని ఫోన్‌తో దిగొచ్చు.. కానీ ఒకప్పుడు ఫొటో దిగాలంటే నానా హంగామా ఉండేదన్నారు.

సీనియర్ ఫొటోగ్రాఫర్లకు సన్మానం



జిల్లా కేంద్రంలో..

కామారెడ్డి టౌన్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా శనివారం కామారెడ్డి జిల్లా ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్, ల్యాబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ ఫొటోగ్రాఫర్‌లను ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రంలోని పద్మశాలి సంఘం భవనంలో శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. యూనియన్ అధ్యక్షుడు పిట్ల రాజేందర్, కోశాధికారి తిరుమల బాలరాజు, ఉపాధ్యక్షులు ఎండీ యూనిస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నవీన్ కుమార్, ఆసం శ్రీనివాస్, భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

తాడ్వాయిలో..



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి పూజించారు. ఎస్సై ఆంజనేయులు, సంఘం మండల అధ్యక్షుడు కృష్ణచైతన్యగౌడ్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో..



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డిలో ప్రపంచ ఫొటోగ్రఫి దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రామకృష్ణ, విఠల్, కార్తిక్ తదితరులు న్నారు.

బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో రక్షాబంధన్



ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డికి రాఖీ కడుతున్న జయ దీదీ

కామారెడ్డి క్రైం: బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం కామారెడ్డి శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో రక్షాబంధన్ నిర్వహించారు. ఎస్పీ శ్రీనివాస్ రెడ్డికి బ్రహ్మకుమారిస్ రీజనల్ ఇన్చార్జి జయ దీదీ రాఖీ కట్టారు. అంతేకాకుండా జిల్లాకు చెందిన డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుళ్లందరికీ రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.

సమస్యల్ని పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలం



మాట్లాడుతున్న వనం సుధాకర్

కామారెడ్డి టౌన్: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఎంసీపీఐయూ కేంద్ర కమిటీ సభ్యుడు వనం సుధాకర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజల్ని మోసం చేస్తున్నాయని విమర్శించారు. ఉద్యోగాలు కల్పించకుండా మళ్లీ ప్రజలను మరో మారు మోసగించడానికి సిద్ధమవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి మాలోత్ జబ్బర్ నాయక్, సుజాత, పద్మ, రమేష్, భార్గవి, మంజుల పాల్గొన్నారు.

'దళిత బంధు' వర్తించేలా చూడాలని వినతి

దోమకొండ: తమకు దళిత బంధు పథకం వర్తించేలా ప్రజాప్రతినిధులు చూడాలని కోరుతూ శనివారం దోమకొండ ఎస్సీ కాలనీకి చెందిన మాల సంఘం సభ్యులు ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేశారు. జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద, సర్పంచ్ నల్లపు అంజలి ఇళ్లకు వెళ్లి వినతిపత్రాలు అందజేశారు. తమను లబ్ధిదారులుగా ఎంపిక చేసేలా చొరవ చూపాలన్నారు.

ఆకర్షణీయంగా సాక్షి దినపత్రిక పెయింటింగ్

రామారెడ్డి (ఎల్లారెడ్డి): పోసానిపేట మినీ గ్రంథాలయ గోడల మీద వేసిన చిత్రాలు ఆకట్టుకున్నాయి. ఈ పెయింటింగ్ చిత్రాలలో సాక్షి దినపత్రిక చదువుతున్న వృద్ధుడి ఫొటో ఆకర్షణీయంగా ఉంది.



పోసానిపేటలో గ్రంథాలయానికి వేసిన పెయింటింగ్

పిచ్చిమొక్కలు తొలిగించాలని..



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి విద్యానగర్ భారత్‌గ్యాస్ ఏజెన్సీ సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలు అల్లుకుపోయి ప్రమాదకరంగా తయారైందని, ఎన్‌పీడీసీఎల్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ప్రక్కన మురికికాలువ ఉన్నందున కొద్దిపాటి వానలకే భారీ వరద వస్తోందని, దీంతో చెత్త తట్టుకుని దుర్గంధం వ్యాపిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రమాదాలు జరగక ముందే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద శుభ్రం చేయాలని కోరుతున్నారు.